


# శ్వేత...!

ఎంత అందమైన పేరు... ఆమె పేరులోని ఆ రెండక్షరాలూ పలుకుతుంటేనే ఎంతో హాయిగా అన్పించేది. పేరుకు తగ్గట్టే శ్వేత నిజంగా అందాలరాశి. కాదు... చక్కదనాల చుక్క. కాదు... కాదు... బ్రహ్మ అమృతంతో పోతపోసి చెక్కిన ముద్దుగుమ్మ. అవును. తొలిచూపులోనే... నా హృదయతంత్రులు మ్రోగేలా చేసిన మొదటి అమ్మాయి శ్వేత. అసలు స్త్రీ తలంపే లేని నా మనసులో మొదటి సారిగా కలవరం రేపిన అందాల భరిణ శ్వేత.

# శ్వేత గులాబి

## బంగారు జయభారతి మొదటి కథ

నేను డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే రోజుల్లో... నాకు జూనియర్ శ్వేత. అది కార్తీకమాసం కావడంతో కాలేజీలో అందరమూ కలిసి పిక్నిక్‌కి వెళ్లడం జరిగిందోసారి. అక్కడ చీటీలు వేసుకుని ఆట ఆడాలని నిర్ణయించారు సరదాగా. చీటీలో రాసివున్న ప్రకారం ఎవరికి ఏమొచ్చినా అలాగే చేసితీరాలని కండిషన్ పెట్టారు. అప్పుడు ఆ ఆటలో శ్వేతకి వచ్చిన చీటీలో తనకు వెనుక ఉన్న వ్యక్తికి 'ఐ లవ్ యూ చెప్పాల'ని రాసి ఉంది. తన వెనుక నేనే ఉన్నాను.

అప్పటివరకూ అమ్మాయిలపై దృష్టిలేని నాకు... ఆ క్షణంలో శ్వేతను చూడగానే గుండె లయ తప్పింది. నాలో ఏదో తెలియని గుబులు. గులాబీరంగు చుడీదార్‌లో సన్నజాజి తీగలా ఉంది శ్వేత. అందమైన హెయిర్‌స్టైల్, లిప్‌స్టిక్ లేకపోయినా చెమ్కీ అద్దినట్లు అందంగా వంపు తిరిగిన పెదవులు, అందమంతా నాదే సుమా అన్నట్టున్న ముక్కు, తుమ్మెద రెక్కల్లాంటి కళ్లు... బంగారుఛాయ నుంచి లేత గులాబీ వర్ణం సంతరించుకున్న ఆ మోము... అందరి మధ్యా 'ఐలవ్‌యూ' చెప్పడంవల్లనేమో ఆమె ముఖం మరింత అందంగా కందిపోయింది.

అయ్యబాబోయ్... ఇంకాసేపు అలాగే చూసానంటే... నా గుండె ఆగిపోతుందేమో...? భగవంతుడు నాకు జన్మనిచ్చినందుకు ఈ రోజుతో నా జన్మ సార్థకమైంది. ఆ క్షణంలో సడన్‌గా నాకో పాట గుర్తొచ్చింది.

"అందమైన ప్రేమరాణి చేయి తగిలితే...
సత్తురేకు కూడా స్వర్ణమేలే..."

ఇదివరకు ఆ పాటన్నా, దాని అర్థమన్నా నాకు కంపరంగా ఉండేది. కానీ శ్వేతను చూసిన మరుక్షణం ఆ పాట – శ్వేతకు అన్వయించి వ్రాయబడిందేమోనని అనిపించసాగింది.

ఆ తరువాత కాలేజీలో శ్వేతను నేను అప్పుడప్పుడూ పలకరిస్తుండడం, ఆమె కూడా బదులుగా మాట్లాడడం జరిగేది. అయితే ఆ కొద్దిసేపు మాటల్లోనే నేను గమనించిందేమంటే – నేను ఆమెతో ఎంత ఆరాధనగా మాట్లాడతానో, దానికి వ్యతిరేకంగా శ్వేత 'తప్పదురా భగవంతుడా' అన్నట్టు నాతో మాట్లాడడం గమనించాను.

ఒకరోజు...

బిర్లా ఫ్యామిలీలోని ఓ యువకుడు తనను ప్రేమించి పెళ్లి చేసుకున్నట్టు శ్వేతకు కల వచ్చిందట. ఆ కల గురించి చెప్పి... ఎంత పొంగిపోయిందనీ...

శ్వేతని ఏ క్షణంలో చూసినా నాలో ఏదో తెలియని అలజడి రేగేది. ఒక విషయం నేను స్పష్టంగా గమనించాను. శ్వేతలేని జీవితం శూన్యంగా తోచేది. ఆమె తోడు లేకుండా



బ్రతకడం నాకు సాధ్యంకాదనిపించేది.

ఈ అలజడికి పరిష్కారం చూపమంటూ, కలవరపాటుగానే నా ప్రేమను ఆమె ముందు వ్యక్తపరిచాను. విషయం విని ఎంత పెద్దగా నవ్విందనీ... ఆ అందమైన నవ్వు వెనుక - కర్కశత్వాన్నీ గమనించాను.

"లుక్ శరత్! ఆ రోజు ఆటలో అరటి పండులా... నీతో ఐలవ్‌యూ చెబితే - అది నిజమని భ్రమపడడం నీ వెర్రితనం. నన్ను చేపట్టబోయేవాడు... నా కలలోకి వచ్చినట్టు ఏ రాజకుమారుడులాగానో ఉండాలి. యూ నో... ఐ డోంట్ వాంట్ ఏన్ ఆర్డినరీ మేన్... దిసీజ్ మై ఫస్ట్ అండ్ లాస్ట్ వార్నింగ్ టు యూ" అంటూ తన అభిప్రాయం ఎంత నిష్కర్షగా చెప్పిందో... ఇప్పటికీ మర్చిపోలేను.

అదేం చిత్రమోగానీ... ఆ మాటలు విన్న తరువాత కూడా శ్వేతపై నా గుండెలో గూడు కట్టుకున్న ప్రేమ అణువంతయినా చలించ లేదు. అప్పటికీ ఇప్పటికీ... ఎప్పటికీ శ్వేతే నా సర్వస్వమని... ఆమె ధ్యాసతోనే ఇప్పటి వరకూ గడిపాను.

కాలం ఎవరికోసమూ ఆగదు. నాకు హైద రాబాద్‌లో బ్యాంక్ క్లర్క్‌గా ఉద్యోగం రావడంతో - ఆ బ్యాంక్‌కి దగ్గర్లోనే చిన్న పోర్షన్ అద్దె ఇంట్లోకి మారిపోయాము నాన్నా, నేను. శ్వేత ఊహల్ని కూడా నాతోపాటు హైదరాబాద్ తీసు కొచ్చేసాను. నాన్న నా పెళ్లికోసం పడే ఆరాటం చూసి జాలిపడడం తప్ప... శ్వేత లోకం నుంచి బయటకు రాలేని నిస్సహాయుణ్ణి అయ్యాను.


ఓసారి నాన్నకు గుండెపోటు వచ్చి నయ మవడం - ఆ సమయంలోనే పెళ్లి చేసు కుంటానని నేను ఆయనకు మాట ఇవ్వడం అసంకల్పితంగా జరిగిపోయాయి. దాని పర్య వసానమే ఇప్పుడు నాన్న స్నేహితుడు పరం ధామయ్యగారు చూసిన సంబంధానికి బయలు దేరడం. సాయంత్రం నాలుగింటికల్లా బయలు దేరాలి. అప్పుడు మంచి ముహూర్తమట. త్వరగా రెడీ అవమని హడావుడి చేసి వెళ్లారు పరంధామయ్యగారు. నాన్న గడ్డంగీసుకోమని కోప్పడితే అద్దంముందు కూర్చున్నాను. నేను మరీ బాలీవుడ్ హీరో అంతటి అందగాణ్ణి కాక పోయినా... స్టయిల్‌గా... డిగ్నిఫైడ్‌గానే ఉంటా ను. విశాల వదనం, స్థిరదృష్టితో ఉన్న కనులు, షార్ప్‌గా ఉన్న ముక్కు, వత్తయిన క్రాఫ్, గుడ్ కాంప్లెక్షన్... టోటల్‌గా నైస్ లుకింగ్... ఇలా ఒకటే ఆలోచనలు నాలో ముసురుకోసాగాయి. మరి... శ్వేతకు... నేనెందుకు నచ్చలేదు...?

ఆ రోజు సాయంకాలం అన్యమనస్కం గానే... అమ్మాయి తరఫు వాళ్లింటికి వెళ్లాము. జరిగే తతంగమంతా ఈ దేహానికి సంబంధించి నది మాత్రమే. నా మనసంతా శ్వేత నిండి పోయి ఉందనిపించింది. కాఫీ, ఫలహారాలు... మిగతా ఫార్మాలిటీస్ పూర్తయ్యాయి. నాలో ఏదో అనీజీనెస్. అప్పుడే అమ్మాయిని తీసుకు వచ్చి కూర్చోబెట్టినట్లున్నారు. అమ్మాయిని చూడకూడదని ముందే నిర్ణయించుకోవడం వల్ల అక్కడ ఉన్న ఏదో వీక్లీ చూస్తూ కూర్చు న్నాను. ఎవరూ చూడకుండా... నాన్న నా చేతి మీద గిల్లినా - నేను వీక్లీ నుంచి దృష్టిని మరల్చ లేదు. బాగోదని నాన్నే కాస్త చొరవ తీసుకుని, చిన్నగా గొంతు సవరించుకుని ప్రశ్నించారు.

"నీ పేరేమిటమ్మా!"

"...శ్వేత!"

ఆ పేరు, స్వరం విని దిగ్గున తలెత్తి చూద్దు ను కదా! ఎదురుగా నా కలల రాణి... నా ప్రాణం... శ్వేత. అదే సమయంలో శ్వేత కూడా




నా వైపు చూసింది. ఆ కళ్లల్లో ఆశ్చర్యం. "ఆ పెళ్లికొడుకు నువ్వేనా?" అన్నట్టు. ఆ సన్నివేశంలో నాకు ఎవరో రైటర్ వ్రాసిన 'గాడ్స్ గిఫ్ట్' అనే నవలలోని ఒక వాక్యం గుర్తుకు రాసాగింది. 'దేనికయినా దేవుడు వరమిస్తే... వెంటనే కాకపోయినా... అనుకున్న దానిని తప్పక పొందితీరుతాము' చిన్నగా నవ్వుకున్నాను. నాలో ఏదో తెలియని ఉత్తేజం, నా ముఖంలోని వెలుగుని గమనించి... నాన్న కూడా సంతోషించారు. శ్వేత వాళ్ల నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అవడంతో ఈ ఊరు వచ్చారని వారి మాటల ద్వారా తెలిసింది.

జీవితమంతా ఒకేలా స్తబ్దుగా గడిస్తే... నేటి ప్రపంచం కంప్యూటర్ యుగం కాలేదేమో...! ప్రతి ప్రాణి జీవితంలోనూ సంతోషతరంగాలు - దుఃఖ ఛాయలు వంటి అనేక మార్పులు సర్వసాధారణం. దేవుడు నాకు ఇచ్చిన వరం శ్వేత. నా జీవితంలో ఆనందవీచికలా సింపుల్‌గా శ్వేతతో నా పెళ్లి జరిగిపోయింది.

తొలిరాత్రి... శ్వేతతో మనసువిప్పి ఎన్నో మధురానుభూతులు పంచుకోవచ్చని ఆశపడ్డాను. ముగ్ధమనోహరం... అందానికి భాష్యం చెప్పిన లావణ్యవతి. కొద్దిపాటి అలంకరణతోనే దేవకన్యలా వెలిగిపోతోంది శ్వేత. కానీ పరీక్షగా చూస్తే తెలిసింది శ్వేత కళ్లల్లోని తిరస్కారభావం.

నాలో ఏదో అపశృతి మొదలవసాగింది. నేను సందేహించినట్టుగానే నా అపశృతిని నిజంచేస్తూ నన్నుద్దేశించి అంది శ్వేత...

"లిజన్... శరత్! నేను నిన్ను పెళ్లాడానని సంబరపడితే అది నీ పిచ్చితనం. అప్పటికీ, ఇప్పటికీ... నువ్వు నా జీవితంలో ఆటలో అరటిపండులాంటి వాడివే! నా కలలు... ఊహలు ఆనాడే నీకు చెప్పాను. అలాంటపుడు నన్నెందుకు పెళ్లిచేసుకున్నావని అడుగుతావేమో...? నేను మిడిల్‌క్లాస్ ఫ్యామిలీలో పుట్టడం వలన... మా నాన్న ఎక్కువ కట్నం ఇచ్చి నాకు పెళ్లిచేయలేడు కనుక - అలాగని నేనింట్లో పెళ్లికాకుండా ఉంటే - నా తరువాత

ఇద్దరు చెల్లెళ్ల పెళ్లికి ఆటంకమనీ... ఈ సంబంధం చేసుకోకపోతే చచ్చిపోతామని బెదిరిస్తే... గత్యంతరంలేక... నీలాంటి సాధారణ వ్యక్తిని పెళ్లాడాను. అంతేగానీ నీమీద ఏదో ప్రేమ ఉందని మాత్రం భ్రమపడకు. మనకు పెళ్లయినా నువ్వు వేరు... నేను వేరు... ఈ జీవితం ఇలా ఒంటరిగా గడిపేయడానికయినా నేను సిద్ధమే. కానీ నీతో కలిసి ఉండడానికి మాత్రం నా మనసు అంగీకరించదు. మనం నలుగురి దృష్టిలో భార్యాభర్తలం... ఈ బెడ్‌రూమ్‌లో మాత్రం కాదు. ప్లీజ్ మైండిట్"...

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రారంభమైనట్లు...


అగ్నిపర్వతం బద్దలయినట్టు...

సుడిగాలులు చుట్టుముడుతున్నట్టు...

నాకు ఆ క్షణంలో భూమిలో కూరుకుపోతే బాగుండుననిపించింది. శ్వేత గురించి ఎంత తపించిపోయానో నా హృదయానికి తెలుసు. రెండేళ్ల నిరీక్షణ తరువాత... శ్వేత రాకతో తనెంతో ఉప్పొంగిపోయాడు. ఆ మాటలు శ్వేత... నిజంగానే అన్నదా? ఓ గాడ్! నా జీవితంతో ఎందుకిలా ఆటలాడుకుంటావ్? శ్వేత లేనిదే నేను బ్రతకగలనా? నా హృదయం అలా మూగగా రోదిస్తూనే ఉంది.

క్రమంగా నాలో కూడా నిర్లిప్తత చోటు చేసుకోసాగింది. ఈ విషయం నాన్నకు తెలియనివ్వలేదు. శ్వేత కూడా మా ఇద్దరి విషయం నాన్నకు తెలియనీయలేదు.

ఓ రోజు ఉదయం హఠాత్తుగా తీర్థయాత్రలకు బయలుదేరుతానన్నారు నాన్న. ఇక్కడే



ప్రముఖ ఇంజనీర్ ఎం.సి. ఆంజనేయులు రచించిన 'పిల్ల తుపాకి' గేయ కవితాసంపుటి హైదరాబాద్‌లో ప్రసిద్ధ సాహితీవేత్త శీలా వీర్రాజు ఆవిష్కరిస్తున్న దృశ్యం. ప్రముఖ చిత్రకారులు కరుణాకర్, శీలా వీర్రాజు, రచయిత ఎం.సి. ఆంజనేయులు, ప్రముఖ ఇంజనీరు, కవి వరిగి రాధాకృష్ణ ఫొటోలో ఉన్నారు.

ఉంటే నాన్నకు మా విషయం తెలియవచ్చునేమోననే ఉద్దేశ్యంతో సరేనన్నాను. నాకూ, శ్వేతకూ జాగ్రత్తలు చెప్పి, ఆ మరుసటిరోజే తీర్థయాత్రలకు బయలుదేరారు నాన్న.

యాంత్రికంగా బ్యాంక్‌కి వెళ్ళివస్తున్నాను. ఎప్పటికైనా శ్వేత మనసు మారకపోతుందా? అనే ఆశ మాత్రం నన్ను వీడలేదు.

★ ★ ★

శ్వేత స్నేహితురాలు శ్రీజ ఓ రోజు హఠాత్తుగా వారి ఇంటికి వచ్చింది. తలుపు తీసి ఆశ్చర్యపోయింది శ్వేత. శ్రీజ అంతటి కోటీశ్వరురాలు తన ఇల్లు వెదుక్కుంటూ రావడం ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ అన్పించింది. శ్రీజ కట్టుకున్న మైసూర్‌శిల్క్ శారీ... పెట్టుకున్న డైమండ్ నెక్లెస్ వైపు అసూయగా చూస్తూ తన్ను తాను మరిచిపోయింది.

"ఏమే శ్వేతా! నన్ను లోపలికి ఇన్‌వైట్ చేసేదేమైనా ఉందా?... లేక గుమ్మంలో ఇలాగే నిలబెట్టేస్తావా?" నవ్వుతూ అడిగింది శ్రీజ.

"సారీ... వెల్‌కమ్" అంటూ మనస్ఫూర్తిగా శ్రీజను ఆహ్వానించింది శ్వేత.

కాఫీ, టిఫిన్స్ పూర్తయ్యాక 'ఏమిటే శ్వేతా! టాటా, బిర్లా లెవెల్ ఉన్నవాణ్ణి పెళ్లిచేసుకుంటాననేదానివి. కానీ..." అంటూ ఆర్ధోక్తితో ఆగిపోయింది. ఇల్లంతా కలియజూస్తూ...

ఆ మాటలకి ఉడుక్కుంటూ 'చూడు శ్రీజా! ఏదో మా నాన్న బలవంతాన తప్పని పరిస్థితుల్లో శరత్‌ని పెళ్లిచేసుకోవాల్సివచ్చిందిగానీ... నా ఆలోచనలు... ఇప్పటికీ ఆ లెవెల్‌లోనే ఉన్నాయి. అయినా నేనసలు శరత్‌తో కాపురం చేస్తేనే కదా...! అంటూ అసలు విషయం బయటపెట్టింది.

చిన్నప్పట్నుంచీ శ్వేత మనస్తత్వం తెలిసిన శ్రీజ కావాలనే అలాంటి ప్రశ్నవేసింది. గుడ్ శ్వేతా! ఇలాంటి ఆన్సరేదో నీ దగ్గర్నుంచి వస్తుందని నేను ముందే ఎక్స్‌పెక్ట్ చేసాను. కానీ కాసేపు నేను చెప్పేది విను. జీవితమంటే ఏమనుకుంటున్నావ్? డబ్బేనా ప్రధానం? నా గురించి నీకు తెలుసుకదా! చిన్నప్పట్నుంచీ నాకు డబ్బుకు కొదవలేదు. నా పెళ్లి కూడా పెద్ద బిజినెస్ మాగ్నెట్‌తో అయింది. కానీ నా జీవితం బంగారు పంజరంలో బంధించబడ్డ చిలకలాగా ఉంది. ఏమిటీ... అలా చూస్తున్నావ్? అర్థంకాలేదా? ఇది నిజం. నాకు డబ్బు, నగలు, బంగ్లా, బ్యాంక్‌బేలన్స్... ఇంటినిండా నౌకర్లు... ఎక్స్‌ట్రా... ఎక్స్‌ట్రా... ఎన్నో ఉన్నాయి. కానీ ఆప్యాయతానురాగాలు... ప్రేమలు చూపించే మనుషులే లేరు... ఆయన టోటల్లీ మనీమైండెడ్. ఇంకా ఇంకా సంపాదించాలన్న ఆత్రం! ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుంచీ రాత్రి పడుకునే వరకూ... బిజీషెడ్యూల్. అంతా మెకానికల్ లైఫ్. యు నో శ్వేతా? మా పెళ్లయిన ఈ రెండేళ్లలో... కనీసం నాలుగుసార్లయినా మేము కలిసి భోజనం చేయలేదంటే నమ్ముతావా?

ఆ మధ్యనోసారి నాకు మలేరియా ఫీవర్ వచ్చినపుడు... అంత సివియర్ ఫీవర్‌లో కూడా 'డాక్టర్‌కి ఫోన్‌చేసి చెక్ చేయించుకో' అంటూ టూర్‌కెళ్లిపోయారు. వారం తర్వాత వచ్చారు. కనీసం ఆ విషయం ఆయనకి గుర్తుకూడాలేదు. ఇంకా ఆయనకు డ్రింకింగ్... గర్ల్‌ఫ్రెండ్స్ లాంటి వీక్‌నెస్‌లు కూడా ఉన్నాయి. అయితే డబ్బున్నవాళ్లందరూ... అలాగే ఉంటారా? అని నువ్వడగవచ్చు. నా భర్తలా కాకపోయినా... ఆల్‌మోస్ట్ వాళ్ల థాట్స్, వాళ్ల రోజువారీ జీవితం కాస్త తేడాతో ఇలాగే ఉంటాయి.

దూరపుకొండలు నునుపు అనుకుంటారు

నీలాంటి పిచ్చివాళ్లు. నిజం చెప్పాలంటే ప్రేమ, అభిమానం లేని జీవితం దుర్భరం. నేనలాంటి జీవితాన్ని గడుపుతున్నాను కాబట్టి నీకింత క్లియర్‌గా చెప్పాను. అయినా శరత్‌కేం తక్కువ? ఇంకా చెప్పాలంటే నువ్వే శరత్‌కి తగవు. డబ్బే సర్వస్వమనుకొని ఇంకా శరత్‌ని దూరం చేసుకుంటే నీ అంత మూర్ఖురాలు మరొకరు ఉండదు. ఇప్పటికయినా మించిపోయింది లేదు... నీ జీవితాన్ని అందంగా మలచుకోవడం నీ చేతుల్లోనే ఉంది. ఆల్ ద బెస్ట్. నేను మళ్లీ నెక్స్‌ట్ మంత్ వస్తాను. అప్పటికి నువ్వు పూర్తిగా మారిపోయి, శరత్‌ని అర్థం చేసుకుని, అర్థవంతమైన జీవితం గడుపుతూ ఉంటావని ఆశిస్తాను. ఆలోచించుకో... మంచి నిర్ణయం తీసుకో... అవసరమైనదానికంటే కొంచెం కఠినంగానే మాట్లాడి శెలవు తీసుకుంది.

స్నేహితురాలు శ్రీజ వెళ్లిపోయిన తరువాత ఆమె మాటలు శ్వేత చెవుల్లో మార్మోగసాగాయి. మనసులో తీవ్ర అలజడి రేగింది. ఆమె మనసు భర్త శరత్ మీదకు మళ్లింది. తను శరత్ పట్ల ఎంత దురుసుగా ప్రవర్తించిందో కళ్లముందు కదలాడింది. కానీ శరత్ తననేనాడూ కనీసం విసుక్కోలేదు. తనలో ఏనాటికైనా మార్పు వస్తుందని, తన ప్రేమను పొందడానికి ఎంతో ఓర్పు, సహనం ప్రదర్శించాడు. తన ఉన్నత వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్నాడు. కాలేజీ రోజుల్నించీ తనంటే ఎంతో ఇష్టంగా ఉండేవాడు. తనే పొగరుతో అతడి మనసు తెలుసుకోలేకపోయింది. డబ్బే ప్రధానమనుకుని, విలాసవంతమైన జీవితాన్ని కోరుకుంది. చదువుకుని కూడా ఇంగితజ్ఞానాన్ని కోల్పోయింది. భగవంతుడు తన స్నేహితురాలు శ్రీజ రూపంలో తనకు కనువిప్పు కలిగించాడు.

ఇలా ఒకదానివెనుక మరొకటి ఆలోచనలు ఆమె మదిని కలవరపెడుతూంటే తలభారంగా పట్టుకొంది శ్వేత. అప్రయత్నంగా ఆమె కళ్లల్లో కన్నీళ్లు రాసాగాయి. ఆమె మనసు, తనువు కూడా ఇప్పుడు ఆర్తిగా శరత్‌ని కోరుకుంటున్నాయి. అలా కోరుకోవడంతో ఆమె మనసుకు కొంత ఊరట కలిగింది. చురుగ్గా లేచి, చక్కగా తయారై భర్తకోసం ఆతృతగా ఎదురుచూస్తూ కూర్చుంది.

★ ★ ★

బ్యాంక్ నుంచి అలసిపోయి వచ్చిన నేను శ్వేత అలంకరణని గమనించనేలేదు. నా పనులు చేసుకుంటూ స్నానంచేసి ఫ్రెషప్ అయి టీవీ ముందు కూర్చున్నాను. వార్తలొస్తున్నాయి.

టీపాయ్‌మీద వేడివేడి పకోడీల ప్లేటు, మంచినీళ్ల గ్లాసూ పెట్టింది. ఓరగా గమనించాను. తినాలనిపించలేదు... శ్రద్ధగా వార్తలు చూస్తున్నాను.


"పకోడీలు తీసుకోండి... చల్లారిపోతున్నాయ్" ప్రాధేయపడుతున్నట్టు అంది.

శ్వేతా! తలనొప్పిగా ఉంది. కాసేపు నన్ను ఒంటరిగా వొదిలెయ్... టీవీ చూస్తూనే సమాధానమిచ్చాను.

టీ కప్పు తీసుకొచ్చింది. 'వేడివేడిగా త్రాగండి. తలనొప్పి సర్దుకుంటుంది' అంది నన్ను పలకరించడానికి భయపడుతూ.

టీ కప్ తీసుకొని కొంచెం టీ సిప్‌చేసి వదిలేసాను. వార్తలు అయిపోయాయి. టీవీ కట్టేసి వెళ్లి అలసటగా మంచంమీద వాలిపోయాను.

గుమ్మం దగ్గర నిలబడి, 'క్షమించండి' అన్నట్లు దీనంగా మొహంపెట్టి మంచంది.




నేను పలకరిస్తే చాలు... వచ్చి కాళ్లమీద పడిపోదామన్న ఆతృత శ్వేత కళ్లల్లో గమనించాను. శ్వేతలో నేను కోరుకున్న మార్పు ఇదే... కానీ నేను తొందరపడకూడదు. శ్వేతలో ఈ మార్పు తాత్కాలికమా? శాశ్వతమా? అన్నది తేలాలి. అప్పటిదాకా ఇంతే అన్నట్టు నిర్లక్ష్యంగా మరో వైపు తిరిగి పడుకున్నాను.

నాకు దగ్గరగా వచ్చి నిల్చోవడం గమనిస్తూనే ఉన్నాను. గాజుల చప్పుడు వినిపిస్తోంది.

"తలనొప్పి బాగా ఉందా... అమృతాంజనం రాయనా?... సర్దుకుంటుంది..." అంటూ నా నుదురుమీద చేయివేసింది.

నా నుదుటిపై శ్వేత చేయి తీసేసి "నా తలనొప్పయితే పోగొట్టగలవ్. కానీ నా గుండెల్లో ఈ మంటని... ఏం చేయమంటావ్?... ప్లీజ్ లీవ్ మీ ఎలోన్... శ్వేతా! రేపు ఉదయం వరకూ నన్ను డిస్టర్బ్ చేయకు" అంటూ నిద్రకు ఉపక్రమించబోయాను..."

నా పాదాలమీద ఆమె కన్నీటిబొట్లు టపటపమని రాలసాగాయి. ఉలిక్కిపడ్డాను. చటుక్కున లేచి "ఏమిటిది?" ప్రేమపూరితమైన స్వరంతో అన్నాను.

నా పిలుపు... నా మాట... నాకే కొత్తగా వినిపించింది.

"నన్ను క్షమించండి... మీ పట్ల మూర్ఖంగా... అమానుషంగా ప్రవర్తించాను... ఈ రోజు నా చిన్ననాటి మిత్రురాలు శ్రీజ మనింటికి వచ్చింది. శ్రీజ చెప్పేవరకూ నాకు పెళ్లికి అర్థం తెలియలేదు. జీవితంలో డబ్బే ప్రధానమనుకున్నాను. నేను కలల్లో కోరుకున్న వాడితో కాదు... నన్ను కోరుకున్న మీతో నా జీవితం సుఖమయంగా, గౌరవప్రదంగా గడిచిపోతుందని తెలుసుకోలేకపోయాను. శ్రీజ నా తప్పుని స్పష్టంగా వేలెత్తిచూపించి... మీ మంచితనాన్ని నాకు తెలియజేసింది. నన్ను క్షమించండి... తెలిసీ తెలియని వయసు, ఆకాశంలో చందమామ కోసం మారాంపెట్టే చిన్నపిల్ల మనసు నాది అని మీరు పెద్ద మనసుతో అర్థంచేసుకుని

– నా తప్పు దిద్దుకునే అవకాశం ఇవ్వండి" అంటూ నా చేతుల్లో తన ముఖం దాచుకుంటూ కన్నీళ్లతో అంది.

శ్వేతను చటుక్కున హృదయానికి హత్తుకున్నాను. శ్వేత నా గుండెమీద వాలిపోయింది.

"నీలో అమాయకత్వం నాకు తెలియదా శ్వేతా? నీది మంచి మనసు అని నాకు తెలుసు. దుమ్ము, ధూళితో నిండిన అద్దంలో మనల్ని మనం చూసుకోగలమా... ఆ దుమ్ము, ధూళిని గుడ్డతో తుడిచేస్తే ఆ అద్దంలో మనల్ని మనం చక్కగా చూసుకోవచ్చు. ఏనాటి నుంచో నీలో పేరుకుపోయిన పిచ్చిభ్రమలన్నీ నేటితో తొలగిపోయి... స్వచ్ఛమైన నీ మంచిమనసు మళ్లీ నీలో చేరుకుంది. ఇక మన వివాహ జీవితం హాయిగా గడిచిపోతుంది... సరేనా... ప్లీజ్! రిలాక్స్..." అంటూ ఆమె కన్నీళ్లను తుడిచాను.

ఆ మర్నాటి ఉదయం కాస్త ఆలస్యంగా నిద్రలేచాను. మంచంమీద పడుకునే శ్వేత కోసం చూసాను... కిటికీలోంచి కనబడింది. పూలమొక్కల మధ్య వనకన్యలా తిరగుతోంది. "అక్కా! గులాబీ కోసుకోవద్దా" అంటూ అడిగింది పక్కింట్లోని పదేళ్ల హారిక. కోసుకోమంటూ తలూపింది శ్వేత. "అమ్మో! నాకు గులాబీ తుంచుకోవాలంటే భయం... ముళ్లు గుచ్చుకుంటాయి... నువ్వే కోసిపెట్టక్కా" అంది ఆ అమ్మాయి.

"చూడమ్మా హారికా! ముల్లు గుచ్చుకుంటుందని భయపడి గులాబీపూలు కోసుకోకుండా ఉండగలమా? ఈ ముళ్లకు మనవేళ్లు తగలకుండా... జాగ్రత్తగా గులాబీని ఇలా తుంచాలి" అంటూ గులాబీని తుంచి ఆ అమ్మాయికి ఇచ్చింది. "థ్యాంక్స్ అక్కా!" అంటూ తుర్రుమంది ఆ అమ్మాయి.

## కథానిలయం 11వ వార్షికోత్సవ సభలు

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 'కథానిలయం' వార్షికోత్సవ సభలు ఫిబ్రవరి 2వ శనివారం – ఆదివారం (9, 10 తేదీలు) జరుగనున్నాయి. ఆహ్వానం అందడం ఆలస్యమైనా లేక అందకపోయినా ఈ ప్రకటననే ఆహ్వానంగా భావించి, సాహిత్యాభిమానులంతా తప్పక విచ్చేయవలసిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

ఫిబ్రవరి 9వ తేదీన అతిథులతో ఇష్టాగోష్టి – పుస్తకావిష్కరణలు, 10వ తేదీన 'కథానిలయం' వార్షికోత్సవ సభ జరుగుతాయి.

దూరం నుంచి వచ్చేవారు ముందుగా తమ రాక సంగతి తెలియజేస్తే వారికి వసతి సౌకర్యాలు ఏర్పాటుచేసే అవకాశం ఉంటుంది.

ఇతర వివరాలకు... కారా – 94405 78506, కార్యదర్శి – 94410 95961 గార్లను సంప్రదించవచ్చు.

గదిలోకి వచ్చి మంచంపై నా ప్రక్కన కూర్చుంది... "అమ్మాయిగారు పొద్దున్నే గులాబీల మీద దండయాత్ర చేస్తున్నారేమిటి?" అన్నాను నవ్వుతూ.

"గులాబీ వెనుక ముల్లులాగా... నాలోని మూర్ఖత్వాన్ని వదిలేసి... స్వచ్ఛమైన మనసుతో మీకు అంకితమై మిమ్మల్ని రోజూ పూలతో పూజించుకుందామని" అంది సిగ్గుపడుతూ...

"శ్వేతా!" అన్న నా పిలుపుకు పులకరిస్తూ నా ఎదపై వాలిపోయింది శ్వేత. ●